ఊరూరా గణపతికి పూజలు

కమలాపూర్ : నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని సోమవారం మండలంలోని ఊరూరా గణపతికి పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని వినాయక మండపాల్లో బీజేపీ నాయకుడు ఈటల భద్రయ్య ఆధ్వర్యంలోని పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులకు రూ.3 వేల చొప్పున విరాళం అందజేశారు. కార్యక్రమాల్లో పీఏసీఎస్ డైరెక్టర్ మౌటం రమేష్‌బాబు, మాజీ సర్పంచ్ గంధసిరి రవికుమార్, బీజేపీ హుజూరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కోకన్వీనర్ మాట్ల రమేష్, నాయకులు తుమ్మ శోభన్‌బాబు, కనుకుంట్ల అరవింద్, పిల్లి సతీష్, బండి రవి, మౌటం శ్రీనివాస్, మొగిలి, పుల్ల శోభన్‌బాబు, జె.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానాలు

కమలాపూర్‌లో శ్రీ విశ్వసాయి భక్త భజన మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద పత్తిపాక స్రవంతి-శ్రీధర్, శ్రీ భక్త మార్కండేయ భజన మండలి ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయకుడి వద్ద చేరాల సరిత-కిషన్ దంపతుల కుమారుడు రోహిత్, శ్రీ మహా గణపతి భజన మండలి ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయకుడి వద్ద బొజ్జం స్వరూప-సదానందం దంపతులు, శ్రీ శివరామకృష్ణ భక్త భజన మండలి ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయకుడి వద్ద నిర్వాహకులు అన్నదానం చేశారు. సీఐ బొలుమల్ల సంజీవ్, ఎస్సై సీమా ఫర్హీన్, ఎంపీడీఓ పల్లవి, ఏపీఓ రమేష్, బీజేపీ నాయకుడు ఈటల భద్రయ్య అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించి భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించారు. ఉప్పల్‌లో యువ గణేష్ యూత్ ఆధ్వర్యంలో వినాయకుడి వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని సర్పంచ్ దేవేందర్‌రావు, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు సంపత్‌రావు ప్రారంభించారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద అన్నదానాన్ని సీఐ రవిరాజు ప్రారంభించి నిర్వాహకులను అభినందించారు. సీఐ రవిరాజును, ఎస్సై రాజేష్‌రెడ్డిని నిర్వాహకులు సత్కరించారు. మత్స్య సంఘం చైర్మన్ బయ్య తిరుపతి, రైతు సమితి కోఆర్డినేటర్ సాగర్, మెపా నాయకుడు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



కమలాపూర్: భోజనం వడ్డిస్తున్న సీఐ, ఇతరులు

ఎల్కతుర్తి : మండలంలోని దామెరలో వరసిద్ధి వినాయకునికి భక్తులు గోత్ర నామాలతో అర్చనలు, పంచామృతాలతో అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. పలు రకాలతో కూడిన కూరగాయలను స్వామివారికి అలంకరణ చేసి సాయంత్రం అన్నదానం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు గుర్రపు గౌతమ్, రవికిరణ్, పాటి బాలగౌడ్, వలిగె రాజు, హరీష్, పైళ్ల రామ్‌రెడ్డి, పాటి భగవాన్‌గౌడ్, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు. ఎల్కతుర్తిలో సర్పంచ్ కొమ్మిడి నిరంజన్‌రెడ్డి కుటుంబసమేతంగా పూజలు నిర్వహించారు.

'దీన్‌దయాళ్' గొప్ప సంఘ సంస్కర్త

పరకాల : గ్రామీణాభివృద్ధి, స్వావలంబనకు దేశ ఆర్థిక వ్యవస్థ మూలమని చాటిన గొప్ప సంఘ సంస్కర్తగా పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్ అభివర్ణించారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకను సోమవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సంతోష్‌కుమార్ మాట్లాడారు. ఏకతత్మా మానవతావాదం సిద్ధాంత సృష్టికర్తగా దీన్‌దయాళ్ ఉపాధ్యాయను కీర్తించారు. కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు మార్త భిక్షపతి, నాయకులు కాచం గురుప్రసాద్, దేవునూరి మేఘనాథ్, బాసాని సోమరాజు, మార్త రాజభద్రయ్య, ఎం.సంతోష్, ఆర్పీ సంగీత, బలబద్ర రాజు, సోషల్ మీడియా కన్వీనర్ ఎం.సురేష్ తదితరులు పాల్గొన్నారు.



దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సంతోష్‌కుమార్

'అప్పు కింద భూఆక్రమణ'

ఆత్మకూరు : తనకు ప్రభుత్వం ఇచ్చిన 20 గుంటల భూమిని మండల కేంద్రానికి చెందిన దుగ్యాల రమేష్ రూ.1.75 లక్షల కింద అప్పు కింద ఆక్రమించుకున్నాడని తనుగుల రామానుజం విలేకరుల ఎదుట సోమవారం వాపోయాడు. తను బాకీ ఉన్న డబ్బు చెల్లిస్తానని, తనకు భూమి ఇప్పించాలని పోలీసు శాఖను కోరుతున్నట్లు తెలిపాడు.

క్లుప్తంగా

పేద వైద్య విద్యార్థికి ఏసీపీ చేయూత



ఆత్మకూరు : భూపాలపల్లి జిల్లాలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన పేద విద్యార్థి రత్నం యశ్వంత్ నీట్‌లో 600వ ర్యాంకు సాధించి వైద్య విద్య (ఎంబీబీఎస్) సీటు సాధించగా అభ్యసించేందుకు తక్షణ సాయంగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పరకాల ఏసీపీ కిశోర్‌కుమార్ సోమవారం రూ.20 వేల చేయూత అందించారు. అనంతరం ఏసీపీ మాట్లాడారు. ఎంబీబీఎస్ పూర్తయ్యే వరకు అమ్మ-నాన్న ట్రస్ట్, మాస్ సేవా సంస్థ ద్వారా ఏటా రూ.లక్ష చొప్పున సాయం అందించనున్నట్టు తెలిపారు. విద్యార్థి యశ్వంత్ తండ్రి నర్సయ్యతో కలిసి ఏసీపీ కిశోర్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీఐ రవిరాజు, ఎస్సై రాజేష్‌రెడ్డి పాల్గొన్నారు.

వాహన తనిఖీలో రూ.4 లక్షలు సీజ్



ఆత్మకూరు : మండలంలోని గుడెప్పాడ్ జంక్షన్‌లో పరకాల డివిజన్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. నల్లబెల్లి మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన రవీందర్ సరైన పత్రాలు లేకుండా కారులో రూ.4 లక్షలు తీసుకెళ్తుండగా సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ రవిరాజు మాట్లాడారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు కలిగి ఉండాలని, నిబంధనలు పాటించాలని, పెద్ద మొత్తంలో నగదు తీసుకెళ్తే సంబంధిత ఆధారాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. తనిఖీలో పరకాల రూరల్ సీఐ మల్లేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

వీరభద్రుడి ఆలయ హుండీ లెక్కింపు



ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలంలోని కొత్తకొండ గ్రామంలోని వీరభద్రస్వామి ఆలయంలో దేవాదాయ శాఖ వరంగల్ జోన్ ఇన్‌స్పెక్టర్ సంజీవరెడ్డి, ఆలయ ఈఓ కిషన్‌రావు ఆధ్వర్యంలో హుండీలను సోమవారం లెక్కించారు. ఈ సందర్భంగా మొత్తం రూ.4,70,874ల ఆదాయం వచ్చినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ మాడిశెట్టి కుమారస్వామి తెలిపారు. ఇందులో నోట్లు 4,39,235లు ఉండగా కాయిన్లు 31,639 ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఎల్తూరి ప్రభాకర్, ఎల్లయ్య, శ్రీశైలం, ఓదెలు, సురేందర్, వెంకన్న, ఎంపీటీసీ యాటపోలు రాజమణి, శ్రీనివాస్, అర్చకులు వీరభద్రయ్య, శ్రీకాంత్, రమేష్, శివకుమార్, శ్రవణ్, గురుప్రసాద్, సిబ్బంది రామకృష్ణారావు, సంజీవరావు, రవీందర్, సందీప్, శ్రీధర్, రాజేందర్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ఆశవర్కర్ల సమ్మె



ఎల్కతుర్తి : భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండల కేంద్రాల్లోని ఎంపీడీఓ కార్యాలయాల ఎదుట ఆశకార్యకర్తలు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం సమ్మె కొనసాగించారు. ఈ సందర్భంగా ఆశావర్కర్ల సంఘం భీమదేవపల్లి మండల అధ్యక్షురాలు కొంకట పద్మ మాట్లాడారు. కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమ్మెలో సంఘం ఉపాధ్యాక్షురాలు వసంత, నాయకులు మాడుగుల అలేఖ్య, స్వరూప, పద్మ, భాగ్య, సంగీత, వసంత పాల్గొన్నారు.

పరామర్శ



శాయంపేట : మండలంలోని సూర్జహాన్‌పల్లి గ్రామానికి చెందిన పరకాల మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ జర్పుల తిరుపతినాయక్‌ను అతడి తండ్రి లింగనాయక్ ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి సోమవారం పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె వెంట ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, మైలారం సర్పంచ్ అరికిల్ల ప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి తదితరులున్నారు.

సమాజ నిర్మాణంలో న్యాయ విద్య ప్రధానం

ధర్మసాగర్ : వివక్షతలు, దోపిడీ, ఆధిపత్య పోకడలు లేని సమాజ నిర్మాణంలో న్యాయ విద్య ప్రధానమని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆస్నాల శ్రీనివాస్ తెలిపారు. ఆ కళాశాలలో 'ఇంక్రీజింగ్ డైవర్సిటీ బై ఇంక్రీజింగ్ ఆక్సెస్ సంస్థ, నల్సార్ జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం' ఆధ్వర్యంలో 'న్యాయ శాస్త్ర విద్య-ఉపాధి అవకాశాలు'పై సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడారు. మానవ విముక్తి కోసం పోరాడి చరిత్ర గతిని మార్చిన మహనీయుల్లో అత్యధికులు వృత్తిరీత్యా న్యాయవాదులేనని చెప్పారు. దేశంలో మొదటి స్థానంలో నిలిచిన నల్సార్ న్యాయ శాస్త్ర విద్యార్థులు కీర్తి సాత్విక, జోషిత మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ఇంటర్ విద్యార్థులను కెరీర్ కోసం న్యాయశాస్త్ర విద్య అభ్యసించేలా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. నల్సార్ లాంటి జాతీయ యూనివర్సిటీల్లో ప్రవేశం కోసం నిర్వహించే క్లాట్ పరీక్షలో కరెంట్ అఫైర్స్, లీగల్ ఆప్టిట్యూడ్, జనరల్ ఇంగ్లీష్ ఉంటాయని వివరించారు. ప్రభుత్వ న్యాయ శాఖ ఉద్యోగాలతోపాటు అన్ని ప్రైవేటు, కార్పొరేట్ కంపెనీల్లో, బీమా రంగాలలో ఉన్నత ఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులకు ఇంటర్‌తోపాటే క్లాట్ పరీక్షకు ఉచితంగా శిక్షణ, స్కాలర్‌షిప్ అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ మాదవి, అధ్యాపకులు జ్యోతి, కనకయ్య, కరుణాకర్‌రెడ్డి, బాబురావు, రాములు, వెంకట్, ప్రభాకర్, మంజుల, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్

ప్రజాచైతన్యంలో విద్యార్థులు కీలకం

పరకాల : ప్రజలను చైతన్యవంతం చేయడంలో విద్యార్థులు కీలకమని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సంతోష్‌కుమార్ తెలిపారు. ఆ కళాశాలలో సోమవారం ఎన్ఎస్ఎస్ డే నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువులకే పరిమితం కాకుండా సమాజ సేవలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువత విద్య ప్రాముఖ్యతను తెలిపేలా ప్రజలను చైతన్యవంతం చేయాలని సూచించారు. హరితహారం, మూఢనమ్మకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. మెరుగైన సమాజ నిర్మాణంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్ల పాత్ర క్రియాశీలకమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ జి.ఓదేలు, అధ్యాపకులు డాక్టర్ అరుణ, డాక్టర్ ఎల్.ఇందిరాదేవి, డాక్టర్ ఎం.నవీన్, డాక్టర్ వి.రాజయ్య, అశోక్‌మోరె, ఎం.రవికుమార్, ఎ.అనిల్‌కుమార్, సీహెచ్.సుస్మిత, పి.సుభాషిణి, డి.సంజయ్‌కుమార్, జి.స్వప్న, టి.రాజు, శ్రీనివాస్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

దామెర : సమాజంలోని ప్రతీ ఒక్కరు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీపీ కాగితాల శంకర్ కోరారు. 'స్వచ్ఛతా హి సేవా' కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో సోమవారం ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల ఆవరణలో, ప్రధాన రహదారిపై శ్రమదానం చేసి చెత్తాచెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ఎంపీపీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలు వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించి వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇళ్ల పరిసరాల్లో చెత్తాచెదారం, నీరు నిల్వకుండా చూసుకోవాలని చెప్పారు. నీటి గుంతలతో దోమలు, ఈగలు ప్రబలి డెంగీ లాంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. పల్లెప్రగతి కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జాకిర్‌అలీ, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు గండు రాము, ఎంపీఓ నాగరాజు, సర్పంచ్‌లు గోగుల సత్యనారాయణరెడ్డి, మేడిపల్లి సాంబయ్య, పుల్యాల రఘుపతిరెడ్డి, దళితబంధు మండల చైర్మన్ గరిగె కృష్ణమూర్తి, ఏపీఓ శారద, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మావతి, జంగం రాణి, తదితరులు పాల్గొన్నారు.

108 అంబులెన్స్ మంజూరులో నిర్లక్ష్యం

శాయంపేట : మండలానికి 108 అంబులెన్స్‌ను మంజూరు చేయించడంలో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి విమర్శించారు. వారు ఇతర పార్టీల నుంచి నాయకులను బీఆర్ఎస్‌లో చేర్పించేందుకే శ్రద్ధ చూపుతున్నారని ధ్వజమెత్తారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగేళ్లుగా ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. ఇటీవల మండల కేంద్రంలో గోడ కూలి గాయపడిన మహిళ 108 అంబులెన్స్ సకాలంలో రాకపోవడంతో మృతి చెందిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డికి, జెడ్పీ చైర్‌పర్సన్ జ్యోతికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే మండలానికి 108 అంబులెన్స్‌ను మంజూరు చేయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు చిందం రవి, మారెపల్లి రవీందర్, లడె రాజ్‌కుమార్, మారెపల్లి రాజు, కట్టయ్య, విష్ణు, మల్లికార్జున్ పాల్గొన్నారు.

రెండు అంశాలతో మున్సిపల్ సమావేశం

పరకాల : రెండు ఎజెండా అంశాలతో సోమవారం స్థానిక మున్సిపల్ సమావేశం నిర్వహించారు. గణేష్ నిమజ్జన ఏర్పాట్లు, పశువుల సంత, గొర్రెలు, మేకల సంత టెండర్ కాలపరిమితి ముగుస్తున్న క్రమంలో ఈనెల 30లోపు వేలం నిర్వహించాలని తీర్మానించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ అధ్యక్షత వహించగా గణేష్ నిమజ్జనం, పశువుల, గొర్రెలు, మేకల సంతల టెండర్ల నిర్వహణపై పాలకవర్గ సభ్యులు చర్చించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ అనిత రామకృష్ణ మాట్లాడారు. సరైన రోడ్డు లేక చాలా కాలంగా వినాయక నిమజ్జనం చేసేందుకు భక్తులు పడుతున్న ఇబ్బందులకు స్థానిక ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తీసుకున్న చొరవతో పరిష్కారం లభించిందని చెప్పారు. అలాగే గండ్రవాడ నుంచి సుమారు కిలోమీటరు పొడవున చలి వాగు వరకు సీసీ రోడ్డు వేయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. శాశ్వత ప్రాతిపదికన రోడ్డు పనులు చేపట్టాలన్న ప్రజల కోరిక కూడా తీరిందని హర్షం వ్యక్తం చేశారు. వినాయక నిమజ్జనాన్ని ఈనెల 27న (బుధవారం) రాత్రి 11 గంటల వరకు పూర్తి చేసేలా నిర్వాహకులు సహకరించాలని కోరారు. సమావేశంలో వైస్ చైర్మన్ రేగూరి విజయ్‌పాల్‌రెడ్డి, కమిషనర్ శేషాంజన్‌స్వామి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ అనిత

గ్రామసభలోనే 'దళితబంధు'కు ఎంపిక చేయాలి

ఐనవోలు : గ్రామసభ ద్వారానే దళితబంధు పథకానికి లబ్ధిదారులను ఎంపిక చేయాలని కాంగ్రెస్ నాయకుడు అరూరి అశోక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో కక్కిరాలపల్లిలోని పంచాయతీ వద్ద సర్పంచ్ రమేష్‌ను గ్రామస్తులు సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం అశోక్ మాట్లాడారు. గ్రామసభ నిర్వహించి లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయని పక్షంలో దళితులతో కలిసి పార్టీ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. తొలుత బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలుకుబడి కలిగిన కొందరు నాయకులకు మాత్రమే దళితబంధు పథకాన్ని వర్తింపజేయడంపై సర్పంచ్‌ను నిలదీశారు. కార్యక్రమంలో కాటబోయిన కుమారస్వామి, కంజర్ల సరోజన, తూళ్ల భూమమ్మ, తాటికాయల ఎల్లమ్మ, యాకమ్మ, ఎలిషా, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో అధికారుల పరిశీలన

ఆత్మకూరు : మండలంలోని పోలింగ్ స్టేషన్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆదేశాల మేరకు మండల అధికారులు సోమవారం సందర్శించి పరిశీలించారు. పోలింగ్ స్టేషన్లలో వసతులను ప్రత్యక్షంగా పరిశీలించారు. తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీఓ చేతన్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

తపాలా శాఖ ఆధ్వర్యంలో మెరుగైన సేవలు



ధర్మసాగర్ : భారతీయ తపాలా శాఖ ఆధ్వర్యంలో మెరుగైన సేవలు అందిస్తున్నట్టు హనుమకొండ సబ్ డివిజన్ పోస్టల్ ఏఎస్పీ మూల రమాదేవి తెలిపారు. మండలంలోని పెద్దపెండ్యాలలో సర్పంచ్ ఆకారపు అన్నమ్మ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో రమాదేవి పాల్గొని మాట్లాడారు. మహిళలకు, చిన్న పిల్లలకు, అన్ని వర్గాల ప్రజలకు పొదుపు, బీమా పథకాలు, ఐపీపీబీ బ్యాంకింగ్ ద్వారా సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. పోస్టల్ శాఖ అమలు చేస్తున్న స్కీములను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ నిమ్మ కవిత, ఎంపీటీసీ ఆకారపు నాగయ్య, ఉపసర్పంచ్ శివాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టిజన్‌లుగా గుర్తించాలని ఎమ్మెల్సీకి వినతి

ఆత్మకూరు : అన్‌మ్యాన్ కార్మికులను ఆర్టిజన్‌లుగా గుర్తించాలని కోరుతూ ఎమ్మెల్సీ, మాజీ స్పీకర్ మధుసూదనాచారికి మండలానికి చెందిన అన్‌మ్యాన్ సంఘం జిల్లా అధ్యక్షుడు బూర వరుణ్‌గౌడ్ ఆధ్వర్యంలోని బృందం సోమవారం హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేసింది. అనంతరం ఎమ్మెల్సీకి అన్‌మ్యాన్ కార్మికుల సమస్యలను వరుణ్‌గౌడ్ వివరించారు. ఎస్పీడీసీఎల్‌లో పని చేస్తున్న కట్టర్లను ఆర్టిజన్లుగా గుర్తించారని గుర్తు చేశారు. అలాగే ఎన్పీడీసీఎల్‌లో పని చేస్తున్న అన్‌మ్యాన్ కార్మికులను ఆర్టిజన్‌లుగా గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు అబ్బోజు పూర్ణాచారి, నాయకులు అరుణ్‌కుమార్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో బహుజనులు సత్తా చాటాలి

ఆత్మకూరు : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక ఓట్లు కలిగిన బహుజనుల సత్తా చాటాలని ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్పీ) ఎమ్మెల్యే అభ్యర్థి పూరెళ్ల రమేష్ కోరారు. మండలంలోని హుజ్‌బుజుర్గ్, కటాక్షపూర్ గ్రామాల్లో ఆయన సోమవారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాలకులకు ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రవి, ప్రధాన కార్యదర్శి సలీం పాషా తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ సింహగర్జన వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

పరకాల : ముదిరాజ్ సింహగర్జన వాల్‌పోస్టర్లను పట్టణంలోని అమరధామంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మెపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ మాట్లాడారు. అక్టోబర్ 1న పట్టణంలో నిర్వహించనున్న ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పరకాల డివిజన్ అధ్యక్షుడు అల్లె దశరథం, మెపా వ్యవస్థాపక అధ్యక్షుడు బోనాల రమేష్, నారాయణపురం మత్స్యశాఖ సొసైటీ అధ్యక్షుడు మోటం భద్రయ్య, నాయకులు వీర్ల చిన్నబాబు, వనం రాజేందర్, గండి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విలేకరులకు గాయాలు

ఐనవోలు : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విలేకరులు గాయాల పాలైన ఘటన మండలంలోని రాంనగర్ శివారు దేవెరువు కట్ట వద్ద సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. విలేకరులుగా పని చేస్తున్న గడ్డల సురేష్, మంచోజు సత్యనారాయణ మండల కేంద్రంలో విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై స్వగ్రామమైన ఇల్లందకు వెళ్తుండగా నందనం నుంచి వస్తున్న ఐనవోలుకు చెందిన పిట్టల అఖిల్, పిట్టల చరణ్‌ల బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో సురేష్ తలకు తీవ్ర గాయాలు కాగా సత్యనారాయణ చేయి విరిగింది. అఖిల్, చరణ్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

ముగ్గురికి..

పరకాల : పట్టణ శివారులోని నాగారం రోడ్డులో సోమవారం రాత్రి చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఎదురెదురుగా వచ్చిన రెండు బైక్‌లు ప్రమాదానికి గురి కాగా నాగారం గ్రామానికి చెందిన పసుల శ్రీనివాస్, పైడిపల్లికి చెందిన నాగుల సుధాకర్, నాగుల కరుణాకర్ గాయాల పాలయ్యారు. డయల్ 100 ద్వారా సమాచారం అందుకున్న పోలీసు సిబ్బంది నాగరాజు, భాస్కర్ ఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి పంపించారు.

చైర్మన్‌గా అవకాశం ఇవ్వండి

ఐనవోలు : మండలంలోని ఐనవోలు శ్రీమల్లికార్జున స్వామి (మల్లన్న) ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్‌గా యాదవ సామాజిక వర్గానికి చెందిన తనకు అవకాశం ఇవ్వాలని డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావును ఒంటిమామిడిపల్లికి చెందిన రాజారపు రాజు యాదవ్ కోరారు. ఈ మేరకు యాదవ సామాజికవర్గ నాయకులతో కలిసి రవీందర్‌రావును మండల కేంద్రంలోని ఆయన నివాసంలో రాజు యాదవ్ సోమవారం కలిసి గ్రామ పెద్దలు, పార్టీ ముఖ్యుల ఏకగ్రీవ తీర్మానాన్ని అందజేసి మాట్లాడారు. తనకు అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే రమేశ్‌ను, డీసీసీబీ చైర్మన్‌ను కోరగా తనకు, మజ్జిగ జైపాల్‌కు మధ్య పోటీ ఉందని చెప్పి గ్రామపెద్దల, పార్టీ ముఖ్యుల తీర్మాణం తీసుకురావాలని వారు సూచించినట్టు చెప్పారు. ఈ క్రమంలోనే తీర్మాణ ప్రతిని రవీందర్‌రావుకు అందజేసినట్లు వివరించారు. మంగళవారం ఎమ్మెల్యేను కలిసి తీర్మాణ పత్రం అందజేయనున్నట్లు చెప్పారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

పరకాల : విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఏబీవీపీ ముందుకు సాగుతోందని ఆ సంఘం హనుమకొండ ప్రముఖ్ గొడ రాజేందర్ తెలిపారు. ఆ సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘంలో పని చేసి అమరులైన నాయకులు సిరంగి సౌందరయ్య, దగ్గు వెంకన్న, సూరినేని బీమన్న, గొడిశాల అరవింద్ గౌడ్‌ల స్మారకంగా ఉత్తమ విద్యార్థి అభినందన సభను సోమవారం అమరధామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభ పాటవ పోటీలు నిర్వహించి విజేతలకు, పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం రాజేందర్ మాట్లాడారు. సుమారు 50 లక్షల మంది సభ్యులతో ప్రపంచంలోనే అతి పెద్ద విద్యార్థి సంఘంగా ఎదిగినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘటన కార్యదర్శి హర్షవర్ధన్, జిల్లా కన్వీనర్ నిఖిల్, నగర కార్యదర్శి వెంకటరమణ, పూర్వ విద్యార్థులు గాలిబ్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

